## రోడ్డు ప్రమాదంలో గాయపడిన కర్నాటక వాసి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మల్లికార్జున

**బత్తలపల్లి, జనవరి 25 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన కర్నాటక వాసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీహర్ష తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా మొలకలమూరు తాలూకా బొమ్మకెందనకెరె గ్రామం ఏకే కాలనీకి చెందిన మల్లికార్జున(58) బేల్దారి పని చేస్తూ కుటుంబాన్నిన పోషిస్తున్నాడన్నారు. పది రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన అభిషేక్, బసన్నలతో కలసి బత్తలపల్లిలో బేల్దారి పనులు చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీన బత్తలపల్లి నుండి అనంతపురం వైపు వెళుతున్న ద్విచక్రవాహనం రోడ్డు దాటుతుంటున్న మల్లికార్జునను ఢీకొనిందన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లికార్జునను చికిత్స నిమిత్తం అనంతపురం తరలించినట్లు తెలిపారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడన్నారు. బుధవారం మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రిపబ్లిక్ డే నుంచి సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేదం

**అగళి, జనవరి 25 ప్రభాతవార్త :** రిపబ్లిక్‌డే జనవరి 26 నుంచి సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేదిస్తున్నట్లు కోర్టు ఆదేశాలు జారీ చేసిందని పంచాయితీ కార్యదర్శి వేణు, చంద్ర తెలిపారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, ప్లాస్టిక్ పళ్యాలు ఇలాంటి వాటిపై నిషేదం విధించినట్లు తెలిపారు. అంగళ్లలో ఇలాంటి వాటిని అమ్మితే మొదటి సారి 5వేలు జరిమానా, రెండోసారి 10వేలు, మూడోసారి షాపులను సీజ్ చేయడం జరుగుతుందని, దానికి ఉన్న అనుమతిని రద్దు చేస్తామని తెలిపారు. పర్యవరణాన్ని పరనిరక్షించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, ఈ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు.

## అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

**- పోలీసులకే సవాల్ విసిరిన వ్యక్తి అరెస్టు - ఎస్ఐ లావణ్య**



**అగళి, జనవరి 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నర్సాంబూది గ్రామానికి చెందిన లోకేష్ తన పొలంలో అక్రమ మద్యం పెట్టి అమ్ముతుండగా ఎస్ఐ లావణ్య, ఎఎస్ఐలు శ్రీరాములు, బషీర్, సిబ్బంది అతన్ని పట్టుకుని అతని నుంచి 50 కర్ణాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా గత నాలుగు రోజుల క్రితం హుల్లెకెర తాండాకు చెందిన వ్యక్తి మంజునాథ్ అక్రమ కర్ణాటక మద్యం అమ్ముతుండగా అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నర్సాంబూదికి చెందిన అక్రమ మద్యం అమ్మకం దారుడు కొన్ని సంవత్సరాలుగా అక్రమ మద్యాన్ని అమ్ముతూ సొమ్ముచేసుకున్నాడు. అక్రమ మద్యం అమ్ముతున్నాడని తెలిసినా అతను పోలీసులకు దొరకక పోలీసులకే సవాల్ విసిరాడు. మండల వ్యాప్తంగా అక్రమ మద్యాన్ని సరఫరా చేయడంతోపాటు ఇతర మండలాలకు కూడా గుట్టు చప్పుడు కాకుండా మద్యాన్ని సరఫరా చేసే వాడని ఇతనిపై పోలీసులు గట్టిగా నిఘాపెట్టినా పోలీసులకు అందకుండా చాకచక్యంగా తరచూ తప్పించుకునే వాడని ఎస్ఐ లావణ్య, సిబ్బంది కచ్చితంగా అక్రమ మద్యం అమ్మేవాడిని పట్టుకుని అరెస్టు చేయాలని నిర్ణయించి చాకచక్యంగా వారి పొలంలో మద్యం పెట్టి విక్రయిస్తుండగా అతన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో అక్రమ మద్యం, పేకాట, మట్కా లాంటి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లావణ్య హెచ్చరించారు.

## అందరి సహకారంతో బ్యాంకు అభివద్ధికి చొరవ..!

**-టౌన్ బ్యాంకు నూతన అధ్యక్షులు సాదు కుళ్లాయిస్వామి, ఉపాధ్యక్షులు చంగల మహేష్**



నూతన పాలకవర్గంతో ప్రమాణం చేయిస్తున్న బ్యాంకు ఎన్నికల అధికారి జి.కె.బాలగంగాధర్

**ఉరవకొండ, జనవరి 25 ప్రభాతవార్త :** అందరి సహకారంతో బ్యాంకును అభివృద్ధి పతంలో నడిపించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు నూతన అధ్యక్షుడు సాదు కుళ్లాయిస్వామి, ఉపాధ్యక్షుడు చంగల మహేష్ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీబజార్ లోగల బ్యాంకు పాత భవనంలో బుధవారం బ్యాంకు ఎన్నికల అధికారి జి.కె.బాలగంగాధర్ నూత న పాలకవర్గ సభ్యులతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు సాదు కుళాయిస్వామి, చంగల మహేష్ ఏకగ్రీ వంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ బ్యాంకును లాభాల్లోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, పాలకవర్గ సభ్యుల ను (డైరెక్టర్లు) ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు మీరాన్‌బాషా, మండల కోఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, వైసీపీ పట్టణ అధ్యక్షులు సి.ఓబు లేసు, నాయకులు యం.అశోక్‌కుమార్, సి.తిరుపాల్‌శెట్టి, యం.బసవరాజు, లక్కా ఎర్రిస్వామి, రెడ్డి ఆంజినేయులు తదితరులు షాలువాలుకప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు పర్సన్ ఇంచార్జ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్.రవి. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు వి.ఎ.శ్రీనివాసులు, సి.సతీష్‌కుమార్, బ్యాంకు సీఈఓ కరణం వేదమూర్తి పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ వి.హరినాథ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

**టీడీపీ మద్దతుదారు పెద్దకోట్ల రమేష్‌కు సన్మానం :** టౌన్ బ్యాంకు ఎన్నికల్లో డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన టీడీపీ మద్దతుదారు పెద్దకోట్ల రమేష్‌ను ప్రమాణ స్వీకారం అనంతరం అక్కడి వచ్చిన టీడీపీ నాయకులు షాలువాలుకప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి.సుంకరత్నమ్మ, మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, సీనియర్ నాయకులు నర్రా కేశన్న, ఎర్రగుంట్ల వెంకటేష్, యేళ్ల తిమ్మప్ప, యం.రామాంజినేయులు, శంకర సుదర్శన్, యం.వర ప్రసాద్, పి.వన్నూరుస్వామి, నిమ్మల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌టియు జిల్లా మహాసభలు విజయవంతం చేయండి



గోడపత్రికలు విడుదల చేస్తున్న దృశ్యం

**గుంతకల్లు టౌన్, జనవరి 25 ప్రభాత వార్త :** ఫిబ్రవరి 4న స్థానిక గుంతకల్లప్ప కళ్యాణమండవంలో నిర్వహించనున్న ఐఎఫ్‌టియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి.సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐఎంఎల్ న్యూ డెమొక్రసి పార్టీ కార్యాలయంలో మహాసభకు సంబంధించి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. అలాగే కార్మికులు పోరాడి సాధించుకున్న లేబర్‌కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, చిన్నా, నాయకులు రఘునాథ్‌రెడ్డి, జిలాన్, దేవేంద్ర, గోపి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

**-ప్రతిజ్ఞ చేయించిన తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్**



కొత్త ఓటరుకు ఎన్నికల సంఘం జారీ చేసిన గుర్తింపు కార్డు అందిస్తున్న తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్

**ఉరవకొండ, జనవరి 25 ప్రభాతవార్త :** మండలంలో బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా జరిగింది. తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటరుగా నమోదైన వారికి కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మహిళా ఓటర్లకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. మధ్యాన్నం పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును కలిసి ఉండాలన్నారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని దాన్ని ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పోలింగ్ కేంద్రాల బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

**- ఎంపిపి కెంకెర ఈరన్న**



సమాశమైన దృశ్యం

**అమరాపురం, జనవరి 25 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైనవైద్య సేవలు అందించాలని ఎంపిపి కెంకెర ఈరన్న పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటి సమావేశం ఎంపిపి అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమంలో డాక్టర్ భార్గవ్,సర్పంచ్ తిప్పేస్వామి, గిరిజమ్మ ఈరన్న, ఎంపిడివో మునిస్వామి,తహశీల్దార్ సురేష్‌కుమార్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కెంకెర ఈరన్న మాట్లాడుతూ ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి కోసం నిధులు కేటాయించడం జరిగిందని.. వీటిని ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. గ్రామస్థాయిలో ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే ఆశా వర్కర్లకు ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలను వివరించడంతోపాటు ఆరోగ్య మెలుకులు తెలియజేయడంలో కీలక భూమిక పోషించాలని ఆయన డాక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అధికారి ఉమాపతి,సిబ్బంది పాల్గొన్నారు.

## దొడగట్టమ్మ, మరియమ్మ దేవతా మూర్తులకు వైభవంగా గంగాపూజ కార్యక్రమం



పూర్ణ కుంభాలకు తీసుకొస్తున్న దృశ్యం

**అమరాపుర, జనవరి 25 ప్రభాతవార్త :** మండల పరిధిలో హలుకూరు గ్రామ పంచాయతీకి సంబంధించిన శ్రీ దొడగట్టమ్మ, శ్రీ కరియమ్మ దేవతామూర్తుల ప్రతిష్ట, దేవాలయ జీర్ణోద్ధరణతోపాటు నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక దేవాలయ కమిటి అధ్యక్షులు గురుదేవప్ప, ఉపాధ్యక్షులు హలుకూరు కాంతరాజు, కార్యదర్శి పేలుబండ రామన్న, గ్రామ పెద్దల సమక్షంలో గంగా పూజా కార్యక్రమం వైభవంగా గ్రామ దేవతలకు నిర్వహించారు. అదే విధంగా ధ్వజారోహణ కార్యక్రమం, గణపతి పూజ,రక్షాబంధన, వాస్తు హోమ పూర్ణాహుతి కార్యక్రమాలు అర్చకులచేత నిర్వహించారు. అదే విధంగా వివిధ గ్రామాల నుంచి గ్రామ ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. విచ్చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తుననిర్వహించారు. బెంగళూరు శ్రీధర్,సుబ్బారావు, ఎన్ఆర్ హనుమంతరాయప్ప, సుబ్బారావులతోపాటు గ్రామ పెద్దలుపాల్గొన్నారు.

## ముగిసిన మేకలఘట్ట చింతచెట్ల వేలంపాట



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

**గుడిబండ, జనవరి 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొంకల్లు గ్రామ పంచాయితీ మేకలఘట్ట గ్రామంలో ఈఓఆర్డి నాగరాజు నాయక్, సర్పంచు కవితా ఓబన్న ఆధ్వర్యంలో చెరువు, చింతచెట్టు వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా చింతచెట్లను అత్యధికంగా 15 వేల రూపాయలకు వేలం పాట పాడి వెంకటరమణ దక్కించుకోగా చెరువులో చేపల పెంపకానికి చిన్న తిమ్మప్ప అత్యధికంగా వేలం పాట 19 వేల రూపాయలకు వేలం పాట పాడి దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో కవితా ఓబన్న, పంచాయితీ కార్యదర్శి రమష్, పూజారి పల్లి నాగేంద్ర, నాగరాజు, హనుమంతరాయప్ప, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలో ఓటర్ల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**గోరంట్ల, జనవరి 25 ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీ కృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాళ్ల విజయలక్ష్మి, భక్తవత్సలం అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, రఘునాథరెడ్డి, వీరాంజినేయులు పర్యవేక్షణలో బుధవారం ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు మాట్లాడుతూ 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకుని ఎన్నికల సమయంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు అనేది ఒక వజ్రాయుధం లాంటిదని భారతదేశం లాంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడానికి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని ప్రజారంజకంగా నాయకులు పాలించడానికి ఉపయోగపడుతుందని నిస్వార్థమైన ప్రజా ప్రతినిధులను ఎన్నుకుని నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవడానికి వీలవుతుందని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపక బృందం జునీద్, కవిత, హరీష్, బాలమోహన్, శివశంకర్‌రెడ్డి, లక్ష్మీభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలపై రైతులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**విడవనకల్లు, జనవరి 25 ప్రభాత వార్త :** ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో మండల వ్యవసాయాధికారి హెచ్.పెన్నయ్య ఆధ్వర్యంలో మండలంలోని ఉండబండ గ్రామంలో చిరుధాన్యాల ఆహార ప్రాముఖ్యత, వ్యవసాయ పంట స్థిరత్వం, తదితర అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో రైతులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో పోషక విలువలు పెరుగుతాయన్నారు. వీటిని తీసుకోవడం వల్ల మానవునికి శక్తితో పాటు రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. రానున్న కాలమంతా సేంద్రీయ ఉత్పత్తులపై ఆధారపడి జీవించాల్సిన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, ఆరికెలు, ఊదలు, వరిగెలు, అండు కొర్రలు వంటి 9 రకాలైన చిరుధాన్యాలు వర్షాదార వ్యవసాయానికి అనుకూలమని తక్కువ పెట్టుబడితో తక్కువ సమయంలో దిగుబడికి చేతికందడం వల్ల రైతులకు ప్రయోజనమని పేర్కొన్నారు. కేవలు వరి, గోధుమ తినడం వల్ల ఆహారంలో పోషకాల సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ప్రతి రైతు చిరుధాన్యాలు పండించవల్సిందిగా కోరారు. రాబోయే కాలంలో చిరుధాన్యాల పంటలే ముఖ్య ఆహార పంటలు అవుతాయని ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌మునాఫ్, గ్రామ సర్పంచు, ఎఇఒ రాఘవేంద్ర, రైతులు, మహిళా సంఘం సభ్యులు, ఆర్‌బికె సిబ్బంది, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో ఎంపిపి నిధులతో మంచినీటి బోరు



బోరు వేస్తున్న దృశ్యం

**గోరంట్ల, జనవరి 25 ప్రభాతవార్త :** మేజర్ పంచాయతీ జగనన్న కాలనీలోని ప్రజల సౌకర్యార్థం మల్లాపల్లి జగనన్న కాలనీలో లబ్దిదారులకు మంచినీటి సౌకర్యం కల్పించడానికి ఎంపిపి నిధులు 2 లక్షల రూపాయలతో బోరు వేయించారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రమీల మూర్తి, ఎంపిడిఒ రఘునాథగుప్తా, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ ముజమిల్, సర్పంచు శివానంద, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, వైసిపి నాయకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి బోరు వేయించారు. మరో రెండు లక్షల రూపాయలతో మోటర్, పైపులైన్ ద్వారా మంచినీటిని అందించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## రాయలసీమ కార్యదర్శిగా రమేష్ నియామకం



కార్యదర్శిగా నియామకమైన రమేష్

**గుత్తి, జనవరి 25 ప్రభాతవార్త :** పద్మశాలీయ సంఘం రాయలసీమ ప్రాంతీయ కార్యదర్శిగా గుత్తి పట్టణానికి చెందిన రమేష్ ఎంపికయ్యారు. ప్రస్తుతం ఇతను స్థానిక అధ్యక్షునిగా పనిచేస్తున్నానారు. ఆయనను నియమిస్తూ బుధవారం రాయలసీమ అధ్యక్షులు లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా పెద్దయ్యను కార్యవర్గసభ్యునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. వారి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఐ, ఎఐటియు నాయకులు

**పుట్టపర్తిటౌన్, జనవరి 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమగా పేరుపొందిన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని, ఇది చాలా దుర్మార్గమైన చర్యని సిపిఐ, ఎఐటియు నాయకులు విమర్శించా రు. బుధవారం గణేష్ సర్కిల్ నుండి ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. అనంతరం డిఆర్ఓ కొండయ్యకు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా ఎఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న మాట్లాడుతూ, ఈ పరిశ్రమ 32 మంది ప్రజల ప్రాణ త్యాగాలతో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ఆనాడు చేసిన ఉద్యమంతో ఏర్పడిందన్నారు. 35 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో లక్ష మంది ఉపాధి పొందుతున్న పరిశ్రమను కేంద్రం కార్పొరేటర్లకు ధారాదత్తం చేయడానికి పూనుకొందన్నారు. ఈ ఆలోచన మానుకోకపోతేరాష్ట్ర వ్యాప్తంగా మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ డివిజన్ కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు వేమనారాయణ, జయలక్ష్మి, వెంకటనారాయణ, బాసా, చలపతి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

**పుట్టపర్తిటౌన్, జనవరి 25, ప్రభాతవార్త :** మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమ స్యలు పరిష్కరిం చాలని మున్సి పల్ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శ ఎన్.లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు అనుబంధ యూనియన్ నాయకులు మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపిన అనరతం కమీషనర్ వెంకట రామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ మాట్లాడుతూ, పుట్టపర్తి నగర పంచాయతీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ ఈఎస్ఐ బకాయిలుచెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ విధానం రద్దు చేయాలని కోరారు. స్మార్ట్ ఫోన్ లేక , ఎఫ్ఆర్ఎస్ ఆపరేట్ చేయలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ సమస్య పరిష్కరించాలని ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలనికోరారు. శానిటేషన్, ఇంజనీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామయ్య, పెద్దన్న, నరసింహులు, నాగార్జున, రామదాసు, రమేష్, గణేష్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ ఏ మొహం పెట్టుకొని ప్రజల్లోకి వెళుతారు..?!

**-4వేలు కాదు 10వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినా వైసీపీకు నష్టంలేదు -జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి**



సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించే బ్రోచర్లు అందిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, జనవరి 25 ప్రభాతవార్త :** తన తండ్రి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏనాడూ ప్రజల గూర్చి పట్టించుకోని నారా లోకేష్ నేడు యువగళం పేరుతో ఏ మోహం పెట్టుకొని ప్రజల్లోకి వెళతారని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. కూడేరు మండలం ఎంఎం హళ్లి గ్రామంలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొనగా ప్రజలు, పార్టీ శ్రేణులు వారిని ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే బ్రోచర్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో అర్థం కావడంలేదని వై.ఎస్.జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా, సుభిక్షంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 4వేల కిలోమీటర్లు కాదు 10వేల కిలోమీటర్లు చేసినా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ ప్రభుత్వానికి వచ్చే నష్టమేమీ లేదన్నారు. నాడు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను పీక్కుతిన్న టీడీపీ పాలనకు నేడు అవినీతి, అక్రమాలకు తావులేని పారదర్శక పాలనను ప్రజలు బేరీజు వేసుకొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ హనుమంతరెడ్డి, వైస్ ఎంపీపీలు సుబ్బమ్మ, దేవా, సీనియర్ నాయకులు బైరెడ్డి రామచంద్రారెడ్డి, తుప్పటి హరీష్, దేవేంద్ర, వడ్డే గంగాధర్, ఇప్పేరు ఎంపీటీసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 27న అగళి చింత ఫలసాయం వేలం

**అగళి, జనవరి 25 ప్రభాతవార్త :** ఈ నెల 27వ తేదిన అగళి సంత మార్కెట్ చెరువు కట్టపై ఉన్న చింత చెట్ల ఫలసాయాన్ని వేలం వేయనున్నట్లు కార్యదర్శి వేణు తెలిపారు. వేలం పాట దారులు రూ.5వేల ప్రకారం డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

## వేలంపాట వాయిదా

**అగళి, జనవరి 25 ప్రభాతవార్త :** 25వ తేది బుధవారం ఇరిగేపల్లి పంచాయితీ పరిధిలోని నందరాజనపల్లి, ఇరిగేపల్లి చింతతోపులో ఉన్న చింత చెట్ల ఫలసాయాన్ని వేలం వేయుటకు అధికారులు నిర్ణయించారు కానీ గడపగడప కార్యక్రమం వల్ల ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కార్యదర్శి వేణు తోలపిఆరు. తదుపరి వేలం 30వ తేది సోమవారం ఉంటుందని ఆరోజు ఈ అవకాశాన్ని వేలం పాట దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నియోజకవర్గంలో కొత్త యువ ఓటర్లు సంఖ్య 1,507

**-ఓటు హక్కు పొందిన 18 సంవత్సరాలు నిండిన యువత**

**ఉరవకొండ, జనవరి 25 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో 18 సంవత్సరాలు వయసు నిండిన యువతీ యువకులు 1,507 మంది కొత్తగా ఓటు హక్కు పొందారు. 2023 తాజా ఓటర్ల జాబితా ప్రకారం ఉరవకొండ (149) అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,15,481కు చేరింది. ఇందులో పురుష ఓటర్లు 1,07,342, మహిళా ఓటర్లు 1,08,113, ఇతరులు 26 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో విడపనకల్లు మండలంలో కొత్త యువ ఓటర్లు 238 మంది, వజ్రకరూరు మండలంలో 423 మంది, ఉరవకొండ మండలంలో 436 మంది, బెలుగుప్ప మండలంలో 243 మంది, కూడేరు మండలంలో 167 మంది ఉన్నారు.

## ప్రజాశ్రేయస్సును కాంక్షించే వారిని ఎన్నుకోవడం మన బాధ్యత

**-ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం**



జాతీయ ఓటరు దినోత్సవంలో మాట్లాడుతున్న కళాశాల ట్రిపుల్ యియియి శాఖాధిపతి వై.సురేష్‌బాబు

**ఉరవకొండ, జనవరి 25 ప్రభాత వార్త :** ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని దాన్ని సక్రమంగా వినియోగించుకొని నేరచరిత్రలేని, ప్రజాసేవాతత్వం కల్గిన వారిని ఎన్నుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కె.అశ్రాఫ్ అలీ నేతృత్వంలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ట్రిపుల్ యియియి శాఖాధిపతి వై.సురేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.వెంకటేష్‌నాయక్ విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. 1950 నుండి దేశంలోని పౌరులందరికీ ఆర్టికల్ 326, 324, 243 ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడానికి ఎన్నికల సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

## వైసీపీ యువనేత వై.ప్రణయ్‌రెడ్డిను కలిసిన టౌన్ బ్యాంకు నూత పాలకవర్గం

**-ఎన్నిక ఏకగ్రీవం అయ్యేందుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు**



యువనేత వై.ప్రణయ్‌రెడ్డిను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న టౌన్ బ్యాంకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు

**ఉరవకొండ, జనవరి 25 ప్రభాత వార్త :** ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు నూతన పాలకవర్గ సభ్యులు బ్యాంకు అధ్యక్షులు సాదు కుళ్లాయిస్వామి, ఉపాధ్యక్షులు చంగల మహేష్ ఆధ్వర్యంలో బుధవారం వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.ప్రణయ్‌రెడ్డిను కలిసి షాలువాకప్పి సన్మానించింది. పదవీ ప్రమాణ స్వీకారం అనంతరం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకొని ఎన్నికలు ఏకగ్రీవం కావడానికి కృషి చేసినందుకుగాను యువనేతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ సభ్యులు (డైరెక్టర్లు) మీనుగ ఎర్రిస్వామి, ఎన్.వెంకటస్వామి, అనెగొంది ప్రవీణ్‌కుమార్, పెద్దకోట్ల శ్రీనివాసులు, గిద్దలూరు వెంకటేష్, ముల్లా షేక్ ఇంతియాజ్‌బాషా, గాజుల నాగరాజు తదితరులు ఉన్నారు.

## గ్రామ పంచాయతీలో ప్లాస్టిక్ వాడకం నిషేధం

**అమరాపురం, జనవరి 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని హేమావతి గ్రామ పంచాయతీలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం జరిగిందని.. ఇందుకు ప్రభుత్వం జీవో నెం: 75 ఆదేశాలకు అనుగుణంగా గ్రామాల్లో ఎలాంటి బ్యానర్లు,ఫ్లెక్సీలు కట్టరాదని గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. గ్రామాల్లో షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు, భోజన పేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు అమ్మకాలు జరుపురాదని ఒక వేళ ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి అమ్మితే తొలిసారిగా రూ. 5వేలు రెండవ సారి అమ్మకాలు జరిపి పట్టుబడితే రూ. 10 వేలు.. మూడవ మారు విక్రయాలు జరిపే అలాంటి షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధనపై గ్రామ పంచాయతీకి సహకరించాలని గ్రామకార్యదర్శి నరేష్‌బాబు, గ్రామ కార్యదర్శి తిప్పేస్వామిలు కోరారు.

